# పాపం! లక్ష్మి

ఏ. ఎం. మోహన్

"లక్ష్మీ? ఏమిటి కిటికీగుండా వీధిలోనికి చూస్తున్నావ్ ఎన్నిసార్లు చెప్పాను. కిటికీగుండా వేసుక చూడొద్దని" అను సావిత్రమ్మ అరుపులకి ఉలిక్కిపడింది లక్ష్మి. తాను కిటికీవద్దకు వచ్చి నిలబడి ఇంకా రెండు నిముషాలు కూడా కాలేదేమో! తన స్థితిని తలుచుకొని బాధతో నిట్టూర్చింది లక్ష్మి. సావిత్రమ్మ పరంధామయ్యలకు లక్ష్మి, రామం ఇద్దరే సంతానం. దంపతులిద్దరు పరమ ఛాందసులు. ఈ శతాబ్దంలో ఉండవలసినవారు కారు. దైవపూజ, మడి ఇదితప్ప మరేమి తెలియవు లక్ష్మి ఏడవ తరగతికి వచ్చినప్పుడు యుక్తవయసురాలయినది. అంతటితో స్కూలుకు పంపుట ఆపివేసారు. లక్ష్మి తెల్లగా, బొద్దుగా ఉంటుంది. చక్కని కోల ముఖం. కనులు, ముక్కు తీర్చిదిద్దినట్లుండును. లక్ష్మి వయసుకు వచ్చి నాలుగు సంవత్సరాలవుతున్నది. ఇంత వరకు వీధి మొగమెట్లున్నదో చూసి యెరుగదు. బయట ప్రపంచ మెట్లున్నదో తెలియదు. లక్ష్మికి పక్కింటి రాధవలె పైచదువులు చదవాలని యుండేది. కాని ఆ ఆశ అడుగుతో అణగారిపోయింది. ఎదురింటి రుక్కులా అప్పుడప్పుడు సినిమా కెళ్ళాలని యుండేది. కనీసము ఆరుమాసముల కొకసారయినా సినిమాకు తీసికెళ్ళొచ్చుగదా! రామం మాత్రం తలితండ్రులకు తెలియకుండా సినిమాల కెళ్ళుతూ ఉండేవాడు, బయట ఆధునికరీతిలో మెలుగుతున్నా ఇంటిలో మాత్రం తలిదండ్రులవలె చెల్లెలను శాసిస్తుంటాడు

లక్ష్మికి స్నేహితులు కూడతక్కువే. మాట్లాడే అవకాశముంటేగదా స్నేహితులుండడానికి. ఎప్పుడయినా ఇరుగు పొరుగు అమ్మాయిలు వచ్చిన వారితో ఒక అర్ధగంటసేపు మాట్లాడితే చాలు. వారు పోయిన తరువాత అమ్మదగ్గ చివాట్లు. లక్ష్మి మనసు బాధపడేది. తన కెప్పుడు విడుదల? తన అదృష్టం మూడేళ్ళనుండి పెళ్ళి ప్రయత్నములు చేయుచున్నను ఒక్కటి కుదరకుండా యున్నది. హా! రేపటికి యెవరో చూడను వచ్చెదరట. కుదురుతుందో

లేదో: "అమ్మాయ్! లక్ష్మి ఈ పచ్చడి కాస్త నూరిపెట్టు" అన్న తల్లి కేకతో ఈ లోకానికి వచ్చింది లక్ష్మి.

మరుసటిరోజు ఇల్లంతా హడావుడిగ వున్నది. "అమ్మా! పెళ్ళివారు వస్తారన గానే లక్ష్మి ముఖంలో ఎంత కళ వచ్చిందో చూడు." అని రామం హాస్యోక్తులకు సిగ్గుపడింది లక్ష్మి. ఇంతలో పెళ్ళివారు వచ్చారు వరుడు చక్కగా వున్నాడు. అతనికి తలిదండ్రు లెవరు లేరట. మేనమామయే అంతా చూచుకొను చున్నాడట. మద్రాసులో ఏదో కంపెనీలో పనట. సావిత్రమ్మ వరునికి పిల్లను చూపించుటకు మొదట ఇష్టపడకపోయినా పిల్లవాని తరపు వాళ్ళ బలవంతమున చూపక తప్పలేదు. పెళ్ళి చూపులప్పుడు లక్ష్మి వంచిన తల యెత్తలేదు. వరుని చూడాలన్న కోరిక యున్నను తరువాత తల్లి దగ్గర ఎట్టి పూజ తీసుకోవలసి వస్తుందోనని ఆపని చెయ్యలేదు. పెళ్ళివారు ఏ సంగతీ తరువాత వ్రాసెదమంటూ వెళ్ళిపోయారు.

సావిత్రమ్మ, పరంధామయ్యలకు వరుడు నచ్చాడు. లక్ష్మికి తగిన భర్తగా వున్నాడు. కాని మన అమ్మాయి అదృష్టమెట్లున్నదో అనుకొంటూ ఉత్తరమునకై యెదురు చూడసాగారు. లక్ష్మికి కావలసినదంతా ఈ పంజరము నుండి తప్పించుకొనిపోవుటయే రెండు రోజుల తరువాత పెళ్ళివారు.

తమకు పిల్ల నచ్చినదని, వచ్చే నెలలో మంచి ముహూర్తము ఉన్నదని వివాహం నిశ్చయించవలయునని వ్రాసారు సావిత్రమ్మ, పరంధామయ్యల సంతోషానికి అవధులు లేవు అంతకంటె రెట్టింపు సంతోషంతో వున్నది లక్ష్మి. అబ్బా! ఇక్కడ నుండి వెళ్ళిపోతే చాలు. కావలసినంత స్వేచ్ఛ లభించును. ఎలాగూ పెళ్ళయినదే విడి కాపురమట. తమకు అడ్డుచెప్పే వారెవరూ లేరు. హాయిగా సినిమాలకు వెళ్ళొచ్చు. సాయంత్రము షికారుకు పోవచ్చు. ఎన్నో రీతులుగా ఊహించుకొని మురిసిపోసాగినది లక్ష్మి

వివాహం సవ్యంగా, సింపుల్‌గా జరిగిపోయినది. లక్ష్మి మనసున మల్లెలు పూయసాగెను. దంపతులిద్దరూ చూడ ముచ్చటగా వున్నారన్న ప్రశంసలకు పొంగిపోయింది. మూడు రోజుల తరువాత భర్త శ్రీనివాస్‌తో మద్రాసుకు ప్రయాణమైనది లక్ష్మి. పుట్టినింటనుండి దూరమవుతున్నానని మనసు బాధపడినను స్వేచ్ఛ దొరికినదన్న సంతోషంతో లక్ష్మి మనసు గగనములో పక్షిలా విహరించసాగెను.

క్రొత్త కాపురం గదా ఇల్లంతా సర్దటానికి రెండు రోజులైనది. మూడవ రోజు శ్రీనివాస్ ఆఫీసుకు వెళ్ళిపోయాడు. పని అంతా అయినాక లక్ష్మి కిటికీ నుండా వీధిలో చూడసాగెను. అబ్బ! ఎన్ని రోజులైనదో ఇంత స్వేచ్ఛగా వీధిలోనికి చూసి ఇన్ని రోజులకు పంజరం

నుండి విడుదలైనది కదా అని సంబర పడిపోసాగింది.

సాయంత్రం తొందరగా కాఫీ పెట్టి పనులన్నీ ముగించినది' జడ వేసుకొని సింగారించుకొని వీధి గుమ్మంలో నిలబడి వేడుక చూడ సాగింది లక్ష్మి. ఇంతలో శ్రీనివాస్ ఆఫీసు నుండి వచ్చారు! లక్ష్మి అతని వెనుకనే లోపలకు వచ్చినది. భర్తకు కాఫీ తీసుకొని రావటానికి వంటింటిలోనికిపోబోయింది. లక్ష్మీ! అన్న భర్త పిలుపుకు వెనక్కు తిరిగి చూసింది లక్ష్మి. "ఇలా వీధి గుమ్మంలో ఎన్నెపరు నిలబడమన్నారు, నీవు ఈ ఇంట్లో ఉండడం అందరికీ తెలియాలి కాబోలు. మీ ఇంట్లో ఉన్నప్పుడు అలా వీధి గుమ్మంలో నిలబడి వేడుక చూచుట అలవాటు కాబోలు. ఇలా వేడుక చూచుట నాకు నచ్చదు. రేపటి నుండి నేను ఆఫీసుకు వెళ్ళినదే వీధి తలుపులు కిటికీ తలుపులు మూసికొని లోపలే వుండాలి తెలిసిందా?" అని కోపంతో పలికాడు.

ఆ మాటలు వినగానే తన ఆశా సౌధము కూలిపోగా నిశ్చేష్టయై నిలిచినది లక్ష్మి.

# నా స్వార్థం

సూర్యునికి
సిగరెట్ చుటుకు పెట్టాలనుంది—
చంద్రుడ్ని
ఐస్ఫ్రూట్ తో పొడవాలనుంది—
గుడ్డోడి సత్తుపళ్ళెంలో
చెల్లని రూపాయి బిళ్ళ వేసి
చిల్లరంతా గుప్పెట్లోకి
ఎత్తుకుంటున్న
వాన సుండెలో
నా వాడి—వేసి
పిడికిలి పేల్చాలనుంది.
"ఆకలి" అన్నవాడికి
నా తిండి పెట్టాలనుంది—
కానీ ఎలా?
ముఖానికి చెమట
కళ్ళకు నీళ్ళు
మెదడులో ఆలోచనలు
కడుపు ఎయిర్ పోర్టులో
ఎవ్వరికీ ఎన్నటికీ కనిపించని
పెద్ద పేరున్న, భయంకర
ఆకలి రాక్షసి—
ఇదీ ఈ మొండి దేహానికి తిండి!
ఎందరి లాగో
నాకు స్వార్థముంది
నేనూ స్వార్థపరుడినే
అందుకే
ముందే నా ఆకలి బాధ తీర్చి
ఎవ్వరికీ పంచిపెట్టను—

—వి.పి చందన్ రావ్